నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ బుధవారం 24 జూలై 2024 | ADILABAD NIRMAL



## అసెంబ్లీకి ఎమ్మెల్యేలు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మంగళ వారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు సమావేశాలకు ఆసిఫాబాద్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్, కాగజ్‌నగర్, ముథోల్, నిర్మల్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## రైతులు అవస్థలు పడుతుంటే పాలాభిషేకాలా?

- బీఆర్‌ఎస్ పార్టీ అన్నదాతలకు అండగా ఉంటుంది..
- రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైంది..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూలై 23 : రైతన్నలు రుణ మాఫీ విషయంలో అవస్థలు పడుతుంటే.. కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో రైతులు ఎదుర్కొంటున్న రుణమాఫీ ఇబ్బందులపై బీఆర్‌ఎస్ కార్యకర్తలతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. అన్నదాతలకు అండగా నిలవాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. అన్నదాతలు వ్యవసాయ పనులను మాని రుణమాఫీ అంటూ బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందారు. రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రూ.లక్ష కూడా చేయడంలో విఫలమతుందన్నారు. కనీస అవగాహన లేకుండా బ్యాంకుల నుంచి తప్పుడు లెక్కలు తీసుకుని రైతులను ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భేషరతుగా రూ.2 లక్షలు మాఫీ చేయని యెడల రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలను చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రోకండ్ల రమేశ్, మార్శెట్టి గోవర్ధన్, గంద్రత్ రమేశ్, లింగారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగారావు, సేవ్వా జగదీశ్, వేణుగోపాల్ యాదవ్, భోజన్న పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

## రహదారిపై కాలనీవాసుల నిరసన

ఎదులాపురం, జూలై 23 : ఆదిలాబాద్ పట్టణంలో టైలర్స్ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. మంగళవారం రహదారిపై నిరసన తెలిపి రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రహదారి గుండానే తలమడుగు మండలంలోని కజ్జర్ల, పల్సి(బి), ఝరిపున గూడకు బస్సులతోపాటు ఇతర వాహనాలతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. ఈ రహదారి గుండా బస్సులు, ఆటోలు, టిప్పర్లు, స్కూల్ బస్సులు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఈ రోడ్డు గురించి ఇప్పటికే కలెక్టర్‌కు రెండు సార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందించి ప్రాణనష్టం జరగక ముందే రోడ్డుకు మరమ్మతు చేయాలని లేదా నూతన రోడ్డు వేయాలని కోరారు.



కుంటాల ఏవోకు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతు నడిపి రాములు

## అందని రుణమాఫీ

కుంటాల, జూలై 23 : మండల కేంద్రానికి చెందిన రైతు బోనగిరి నడిపి రాములు కుంటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి గతేడాది జూన్‌లో రూ.41 వేల పంట రుణం తీసుకున్నాడు. ఇదీ వడ్డీతో రూ.55 వేలు అయింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకంలో భాగంగా వచ్చిన మొదటి జాబితాలో తన పేరు లేదు. వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో చూసుకోగా.. ఆన్‌లైన్‌లో తన ఆధార్ బదులు మరో రైతు ఆధార్ కార్డు జత కావడం వల్ల రుణమాఫీ పథకం వర్తింపు కాలేదని గమనించాడు. వెంటనే కుంటాల రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో సదరు రైతు మండల వ్యవసాయాధికారికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కాగా.. సాంకేతిక తప్పిదంతో జరిగి ఉంటుందని, రైతు డేటాతో ఆధార్ కార్డు డేటా సరిపోకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తింపు కావడం లేదని, బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కుంటాల వ్యవసాయ శాఖ అధికారి సోమలింగారెడ్డి తెలిపాడు.

## ముక్రా(కే) రాష్ట్రానికే తలమానికం

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

ఇచ్చోడ, జూలై 23 : మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి ముక్రా(కే)ను తెలంగాణకు తలమానికంగా నిలిపారని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే కితాబు ఇచ్చారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ, ఆగఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ.. ముక్రా(కే) గ్రామంలో చెత్త ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసి ఆదాయాన్ని సంపాదిస్తున్నారో.. అలాగే ఆసిఫాబాద్‌లోని ప్రతి పల్లె వర్మీ కంపోస్టును తయారు చేసి ఆదాయాన్ని సృష్టించాలని సూచించారు. గ్రామంలో ప్రతి ప్రభుత్వ పథకం వంద శాతం అమలవుతుందన్నారు. ఈ సందర్భంగా ముక్రా(కే) మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్ ఏ విధంగా చెత్త సేకరించి వర్మీ కంపోస్టును ఎలా తయారు చేస్తున్నారో వివరించారు. అనంతరం సుభాష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆగఖాన్ ఫౌండేషన్ సభ్యులు నజీర్, ఎస్‌బీఎం గ్రామీణ కో-ఆర్డినేటర్ ఫణి, ఇచ్చోడ ఎస్‌బీఎం కో-ఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.




ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వర్మీ కంపోస్టును అందజేస్తున్న గాడ్గె సుభాష్

## రాజకీయ బడ్జెట్



*కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రాజకీయ బడ్జెట్‌లా ఉంది. కేవలం అంకెల గారడీకే పరిమితం చేశారు. ఈ బడ్జెట్‌లో మరోసారి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. ఏపీకి రూ.16 వేల కోట్లు, బీహార్‌కూ రూ. 26 వేల కోట్లు కేటాయించిన కేంద్రం.. తెలంగాణకు గుండుసున్నా చూపింది. పార్లమెంట్‌లో తెలంగాణ అస్తిత్వంపై ప్రశ్నించేవారు లేకపోవడంపై అన్యాయం జరుగుతున్నది. బీఆర్‌ఎస్ మాత్రమే తెలంగాణ సమస్యలను ప్రశ్నిస్తుంది. విద్యావ్యవస్థ, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలపై కేంద్రం నీళ్లు చల్లింది. ప్రాంతీయశక్తి బలంగా ఉంటేనే హక్కులను సాధించుకుంటాం. తెలంగాణ ఎంపీలు కేంద్ర మంత్రులను రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను ఎందుకు ప్రశ్నించడం లేదు.*

**- మాజీ మంత్రి జోగు రామన్న**




● నో 'బడ్జెట్'

# కరుణించని కేంద్రం

## సెంట్రల్ బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదు..

- రాష్ట్రానికి పైసా కూడా విదల్చని మోదీ సర్కారు
- సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపులు లేవు
- పెండింగ్‌లోనే ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్
- సీసీఐ, హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్ ఏర్పాటు వాయిదా పడినట్లే..
- గంపెడాశలు పెట్టుకున్న ఉమ్మడి జిల్లా వాసులకు మిగిలింది నిరాశే..

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి నిర్మలమ్మ బడ్జెట్ ప్రసంగంలో అసలు తెలంగాణ ప్రస్తావనే రాలేదు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.48.20 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మనకు పైసా విదల్చలేదు. దీంతో ఎప్పటిలాగే కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న రాష్ట్ర ప్రజలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులకు మరోసారి నిరాశే మిగిలింది. ప్రతిసారి కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్‌ను పరిమితం చేసే కేంద్ర ప్రభుత్వం ఈసారి కూడా అదే చేసింది. మిత్ర పక్షాలున్న రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు భారీ కేటాయింపులు చేసింది. బడ్జెట్ సొమ్ము మొత్తాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు, మిత్ర పక్షాలున్న రాష్ట్రాలకే ఊడ్చి పెట్టింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏళ్లుగా పేరుకుపోయిన పెండింగ్ పనులకు ఈసారైన మోక్షం దక్కలేదు. జిల్లావాసుల ఎదురుచూపులు ఫలించలేదు. రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే అందులో ఒకరు ఆదిలాబాద్ నుంచి గెలిచారు. దీంతో ఈసారి ఆదిలాబాద్‌కు నిధులు పక్కాగా వస్తాయనే అంచనా వేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు. కేంద్రం ప్రభుత్వం జిల్లా విషయంలో మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కేంద్ర పరిధిలోని ప్రాజెక్టులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న వాటికి కూడా నిధులు కేటాయించలేదు. రెండోసారి ఆదిలాబాద్‌లో బీజేపీ ఎంపీని గెలిపించినా కేంద్రం జిల్లా అభివృద్ధిని పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సింగరేణికి పన్ను మినహాయింపు లేదు..

సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను(ఐటీ)లో మినహాయింపుపై ఈసారి కచ్చితంగా అనుకూల ప్రకటన వస్తుందనుకున్నారు. బడ్జెట్‌లో ఇందుకోసం ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని భావించారు. ఇప్పటికే కేంద్రం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు టెండర్లు పిలుస్తుంది. సింగరేణి కార్మికులకు అన్యాయం జరుగుతుందనే భావన అందరిలోనూ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పన్ను మినహాయింపు కల్పించి కాస్త ఊరట కల్పిస్తుందనుకుంటే మరోసారి నిరాశే ఎదురైందని కార్మికులు మండిపడుతున్నారు. ఏళ్లుగా ఉన్న డిమాండ్‌ను ఈసారి కూడా పరిగణలోకి తీసుకోకపోవడంపై పెదవి విరుస్తున్నారు. సింగరేణిని నాశనం చేయాలన్న ఆలోచనతోనే మోదీ సర్కార్ ఉందని, అందుకే కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంగా ఉత్తర, దక్షిణ భారతదేశానికి రవాణ మార్గంగా ఉన్న మంచిర్యాల మీదు రైళ్ల రవాణాను మెరుగుపరచాల్సి ఉంది. ఈ మేరకు రైళ్ల హాల్టింగ్‌లను పెంచి నూతన ఆర్‌వోబీలు, అండర్ బ్రిడ్జిలు పెంచితే రోడ్డు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కానీ.. ఈసారి కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదు. ఇక జిల్లా నుంచి వెళ్తున్న జాతీయ రహదారులు సహా అటవీ, పర్యావరణ అనుమతులు లేక అనేక గ్రామాల్లో రోడ్లు లేవు. కోటపల్లి, వేమనపల్లి, జన్నారం, చెన్నూర్, ఆసిఫాబాద్ జిల్లాల్లో చాలా గ్రామాల్లో రోడ్లు లేక జనాలు అవస్థలు పడుతున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఈ రోడ్ల నిర్మాణానికి కావాల్సిన అనుమతుల విషయంలో కేంద్రం చొరవ చూపుతుందనుకుంటే అది జరగలేదు.

### ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వే లైన్‌కు నిధులేవు..

పాత జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలులో పోవాలంటే మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇందుకు గానూ 9 నుంచి 10 గంటల సమయం పడుతుంది. జిల్లా ప్రజలు రైలులో నగరానికి పోయేందుకు కేంద్రం ఏర్పాటుకు 2009-10 రైల్వే బడ్జెట్‌లో ఆదిలాబాద్ నుంచి పటాన్‌చెరు వరకు లైన్ మంజూరు చేసింది. నిర్మాణ వ్యయం రూ.3771 కోట్లు భారీగా అవుతుండడంతో తక్కువ ఖర్చుతో ఆర్మూర్ లైన్‌ను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్ వరకు లైన్ వేస్తే అక్కడి నుంచి నిజామాబాద్ మీదుగా హైదరాబాద్‌కు రైలులో పోయే అవకాశాలున్నాయి. దీంతో 2017 బడ్జెట్‌లో ఆదిలాబాద్-ఆర్మూర్ లైన్‌కు మంజూరు లభించింది. లైన్ సర్వే నిర్వహించిన అధికారులు రూ.2990 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు వేశారు. ఈ రైల్వే లైన్‌కు కేంద్రం నిధులు కేటాయిస్తుందని జిల్లావాసులు ప్రతి బడ్జెట్‌లో ఎదురు చూస్తున్న నిరాశే కలుగుతుంది. ఈ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రైల్వేలైన్ విషయంలో ఊసేత్తలేదు.

### సీసీఐ ఊసే లేదు..

మూతపడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను పునః ప్రారంభించడానికి అన్ని అవకాశాలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుంది. ప్రస్తుతం సిమెంటు రంగానికి మంచి డిమాండ్ ఉండగా పరిశ్రమ ప్రారంభానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. జాతీయ రహదారి 44కు సమీపంలో పరిశ్రమ భూములు, సిమెంటును తరలించడానికి ఆదిలాబాద్ నుంచి రైలు, మహారాష్ట్రతోపాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు రోడ్డు మార్గం ఉంది. 772 ఎకరాల భూములు, 170ఎకరాల్లో టౌన్‌షిప్, 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌తోపాటు నీటి వనరులు ఉన్నాయి. సిమెంటు తయారీకి అపారమైన వనరులు ఉన్నా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడనాడడం లేదు. సిమెంటు పరిశ్రమను ప్రారంభించాలని అఖిలపక్షం నాయకులు ఆందోళనలు చేసినా ఫలితం లేదు. గతంలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, హన్స్‌రాజ్ గంగారాంలు సీసీఐని ప్రారంభిస్తామని హామీలు ఇచ్చినా ఫలితం లేదు. ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. ఉడాన్ పథకం కింద ద్వితీయ శ్రేణి నగరాలకు విమానాలను నడిపేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్‌లో సైతం విమానాశ్రయం ఏర్పాటుకు అవకాశాలున్నాయని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాను కోరింది. జిల్లాలో పర్యటించిన అధికారుల బృందం ఎయిర్‌పోర్టు మైదానాన్ని పరిశీలించి సానుకూలంగా నివేదికలు అందజేసింది. కానీ.. విషయాన్ని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హైదరాబాద్- ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ రహదారి 80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నేషనల్ హైవేకు ఇరువైపుల ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. జిల్లాలో ముడిసరుకు లభ్యమయ్యే వస్త్ర, వివిధ రకాల పంటల ఉత్పత్తులు, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంది. ఇది వస్తే ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతుంది. కానీ.. కారిడార్ ఏర్పాటును కేంద్ర మంత్రి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కీలక హామీలను నెరవేర్చుకునే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేయకపోవడంపై పలు వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎనిమిది మంది ఎంపీలు ఏం చేస్తున్నారు..



*కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుంచి రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులు ఉన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో వీరు ఏం చేస్తున్నట్లు. బీజేపీ ఎంపీలకు కేంద్ర ప్రాజెక్టులు, నిధుల మంజూరు, సమస్యలపై అవగాహన లేకపోవడం, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో నిధులు మంజూరు విషయంలో మాట్లాడకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరిగింది. గతంలో బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో గళమెత్తి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కేంద్ర పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, ఎయిర్‌పోర్టు, సిమెంట్ పరిశ్రమ, హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్, ఇతర అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బీజేపీ ప్రభుత్వ వివక్షకు నిదర్శనం.*

**- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్.**

### తెలంగాణకు తీవ్ర అన్యాయం



*కుంటాల, జూలై 23 : తెలంగాణ రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున ఎనిమిది మంది ఎంపీలు గెలుపొందారు. రాష్ట్రానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నిధులు తెస్తారనుకుంటే మొండిచేయి చూపారు. అధికారం చేతిలో ఉండి, అభివృద్ధి చేసే సత్తా ఉండి కూడా ఏమి తేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు రెండు సార్లు బీజేపీ ఎంపీలను గెలిపించినా ఒరిగింది శూన్యం.*

**- పెంటవార్ దశరథ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నిర్మల్.**




కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటుతున్న మాజీ సర్పంచ్ మీనాక్షి, గ్రామస్తులు (ఫైల్)




వృక్షాలుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు




కేటీఆర్ ట్విట్టర్(ఎక్స్)లో ట్వీట్ చేసిన పోస్టు

## ముక్రా(కే) వాసులు నా హృదయంలో సదా ఉంటారు

**ట్విట్టర్(ఎక్స్)లో పోస్టు చేసిన కేటీఆర్**

*యేటా తన పుట్టినరోజును పురస్కరించుకుని మొక్కలు నాటి రక్షిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని, మీకు చాలా ధన్యవాదాలు అంటూ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్(ఎక్స్)లో ట్విట్ చేశారు. ముక్రా(కే) గ్రామస్తులు తన హృదయంలో చిరస్థాయిగా ఉంటారని, తన పుట్టిన రోజు సందర్భంగా యేటా మొక్కలు నాటి వంద శాతం రక్షిస్తున్నారని పేర్కొన్నాడు. ప్రతి మొక్కను కాపాడినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు అంటూ ట్విట్ చేశారు. ఐదేళ్లలో నాటిన 10 వేల మొక్కలు నేడు ఏవిధంగా ఉన్నాయో నాడు-నేడు ఫొటోలను పెట్టి ట్విట్టర్ వేదికగా మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి, గ్రామస్తులను అభినందనలు తెలిపారు.*

- ఇచ్చోడ, జూలై 23